క్లుప్తంగా

ఉచిత వైద్యశిబిరం


వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

గంగాధర: మండలంలోని గర్శకుర్తి గ్రామంలో శనివారం మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 120 మందికి వివిధ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. గ్రామాలలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆసుపత్రి హెడ్ గుర్రం కిరణ్ సూచించారు. ఆసుపత్రిలో 24 గంటల వైద్య సేవలతో పాటు సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. వైద్య శిబిరంలో డాక్టర్ సురేశ్, పద్మశాలీ సంఘం నాయకులు లక్ష్మీరాజం, మేనేజర్ కోట కరుణాకర్, దాసరి చంద్రశేఖర్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలి

జమ్మికుంట: రైతులకు నాణ్యమైన పత్తి విత్తనాలు అందుబాటులో ఉంచాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కోకన్వీనర్ చెల్పూరి రాము ప్రభుత్వం, అధికారులను కోరారు. శనివారం పట్టణంలో మాట్లాడారు. నకిలీ విత్తనాలు అరికట్టాలని, డబ్బు సంపాదనే ధ్యేయంగా అమ్మకాలు సాగించే వ్యాపారులపై చర్యలు తీసుకోవాలన్నారు.

జమ్మికుంట టౌన్ సీఐని కలిసిన నాయకులు


శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

జమ్మికుంట: జమ్మికుంట టౌన్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన రామకృష్ణను కాంగ్రెస్ నాయకులు, ఇల్లందకుంట శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ దేశినికోటి, మాజీ కౌన్సిలర్లు బొంగోని వీరన్న, మారపల్లి భిక్షపతి, దేశిని రాధాసదానందం, ఎలగందుల స్వరూప శ్రీహరి, దిడ్డి రామ్మోహన్, రాయికంటి రాజు, పిట్టల శ్వేతరమేష్, పొనగంటి సారంగం, గుల్లి పూలమ్మ మొగిలి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు టంగుటూరి రాజ్‌కుమార్, బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు ఏబూషి శ్రీనివాస్, ముద్రగడ నవీన్‌కుమార్, పంతాటి రవిందర్,ఎండి రషీద్, మధుసూదన్‌రెడ్డి, సదానందం పలువురు వేర్వేరుగా మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

చెక్కు అందజేత


చెక్కు అందిస్తున్న విజేందర్‌రెడ్డి

శంకరపట్నం: మండలంలోని వంకాయగూడెం గ్రామానికి చల్ల కనుకయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఆయన కుటుంబ సభ్యులకు ఎయిర్‌టెల్ పేమెంట్ యాప్ ద్వారా మంజూరైన రూ. పది లక్షల బీమా చెక్కును ఎయిర్‌టెల్ హెడ్ విజేందర్‌రెడ్డి శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ మహేందర్, రాజు, తిరుపతి, శ్రీకాంత్, సురేశ్‌లు తదితరులు పాల్గొన్నారు.

దళితుడిని చితకబాదిన ఎస్ఐని సస్పెండ్ చేయాలి

హుజూరాబాద్: దళితుడిని అకారణంగా చితకబాదిన ఎస్ఐ భార్గవ్‌ను సస్పెండ్ చేయాలని టీపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ అట్రాసిటీ రాష్ట్ర ఇన్‌చార్జి తిప్పారపు సంపత్ డిమాండ్ చేశారు. పట్టణంలో శనివారం మాట్లాడారు. సైదాపూర్ మండలం గొల్లగూడెంకు చెందిన బత్తుల మహేందర్‌ను సైదా పూర్ ట్రైనింగ్ ఎస్ఐ భార్గవ్ విచక్షణా రహితంగా కొట్టాడని, ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థ అంటూ ఇలా ప్రవర్తించడం బాధాకరం అన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు రామచంద్రం, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు వసంత్, యువజన కాంగ్రెస్ నాయకుడు కదిరి రమేశ్ తదితరులున్నారు.

ఫల పంచామృతాభిషేకం

తిమ్మాపూర్: మండలంలోని రామకృష్ణకాలనీ, సుభాష్‌నగర్‌లోని శ్రీవినాయక ఆలయంలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శ్రీఆంజనేయస్వామికి శనివారం ఫల పంచామృతాభిషేకం, విశేష పూజలు ఘనంగా నిర్వహించారు. అర్చకులు ఊరమండ్ల కిరణ్‌శర్మ నేతత్వంలో పూజలు నిర్వహించగా కొమ్మెర మల్లారెడ్డి ఆధ్వర్యంలో హనుమాన్ దీక్షాపరులకు భిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రామ్‌రెడ్డి, ఉపాధ్యక్షులు తిరుపతి, పర్శరాములు, కార్యదర్శి ఆంజనేయులు, సలహాదారులు తిరుపతి, సంతోష్, గ్రామ పెద్దలు మల్లారెడ్డి, సంపత్ రెడ్డి, ప్రణీత్ రెడ్డి, సుగుణ, జగన్, విజయేందర్ రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

జీలుగ విత్తనాల జాడేది

- 25 నుంచి రోహిణి కార్తె ప్రారంభం
- ఇప్పటికే సాగు ప్రణాళిక సిద్ధం చేసిన వ్యవసాయశాఖ అధికారులు
- వరిసాగుకే రైతుల మొగ్గు
- భారీ వర్షాలు కురిశాకే విత్తనాలు విత్తుకోవాలంటున్న అధికారులు

వీణవంక: యాసంగి ముగియడంతో రైతులు వానాకాలం సాగుపై దృష్టిసారించారు. ఈ నెల 25న ప్రారంభమయ్యే రోహిణి కార్తె నుంచి వ్యవసాయ పనులు ప్రారంభిస్తే పంటల దిగుబడి ఆశించిన స్థాయిలో వస్తుందని రైతుల నమ్మకం. ఇప్పటి వరకు ఆశించిన వర్షాలు కురువలేదు. రెండు, మూడు భారీ వర్షాలు కురిసిన తర్వాత పత్తి విత్తనాలు విత్తుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. గత యాసంగిలో మొగిపురుగు, వేరుకుళ్లు తెగుళ్లతో ఆశించిన దిగుబడి రాక రైతులు చతికిలపడ్డారు. గత అనుభవాలను దిగమింగుతూ ఈ వానాకాలం సాగుకు సిద్ధమవుతున్నారు. వేసవి దుక్కులు, పశువుల, కోళ్ల ఎరువు పొలాల్లో పోస్తున్నారు. జీలుగ, జనుము, పిల్లిపెసరు విత్తనాలను విత్తేతుందకు రైతులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే వా నాకాలం పంట సాగు ప్రణాళికను వ్యవసాయాధికారులు సిద్ధం చేశారు. విత్తనాలు, ఎరువులను తెప్పించేందుకు ఉన్నతాధికారులకు నివేదిక అందించారు.


నారుమడి సిద్ధం చేస్తున్న రైతులు

వరి వైపే మొగ్గు..

మండలంలోని 26 గ్రామ పంచాయతీల పరిధిలో వానాకాలంలో వరి 28 వేల ఎకరాలు, పత్తి 3 వేల ఎకరాలు, మొక్కజొన్న 450 ఎకరాలు, ఇతర పంటలు 50 ఎకరాల్లో సాగు చేస్తారని అధికారుల అంచనా, వ్యవసాయ ఆధారిత మండలంగా పేరున్న వీణవంకలో ఎక్కువగా వరి వైపే మొగ్గు చూపుతున్నారు. ఇందులో సన్నాలకు ప్రభుత్వం బోనస్ ప్రకటించడంతో ఈసారి రైతులు సన్నరకం వైపే మొగ్గు చూపనున్నారని, పెసర, కందులు, వేరుశనగా వంటి పంటల వైపు రైతులు దృష్టి సారించచడం లేదన్నారు. వరివైపు మొగ్గు చూపుతున్నా తెగుళ్ల రైతులను కోలుకోలేని దెబ్బతీస్తున్నాయి. కొన్ని గ్రామాలలో రైతులు ముందస్తుగా నాట్లు వేసేందుకు నారుమడులు సిద్ధం చేస్తున్నారు.

రైతుల ఎదురుచూపు

వ్యవసాయ భూముల్లో భూసారం పెరిగేందుకు జీలుగ, జనుము, పిల్లిపెసరు వంటి విత్తనాలను ప్రభుత్వం సబ్సిడీపై ఏటా రైతులకు అందిస్తుంది. వీటిని సాగు చేస్తే భూసారం పెరుగుతుంది. మండల వ్యాప్తంగా 1200 బస్తాల విత్తనాలు అవసరమని అధికారులు నివేధిక పంపారు. అయితే ఇప్పటి వరకు విత్తనాలు రాకపోవడంతో రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. మే 15నుంచి విత్తనాలను విత్తుకోవాలి. కానీ జిల్లా వ్యాప్తంగా విత్తనాలు సెంటర్లకు రాకపోవడంతో అదునుదాటిపోతుందని రైతులు కలవరపడుతున్నారు. పొలం నాటు వేసే 40 రోజుల ముందు జీలుగ విత్తనాలను పొలంలో చల్లుకోవాలి. ఫలితంగా దిగుబడి ఆశించిన మేర వస్తుందని అధికారులు చెప్పుతున్నారు. ఎండలు మండుతున్నాయి... ఈ పరిస్థితుల్లో రైతులు విత్తనాలు విత్తుకోవడం, నారుమడులు సిద్ధం చేసుకోవద్దని, రెండు, మూడు వర్షాలు పడితేనే పనులు ప్రారంభించాలని, లేదంటే భూమిలోని వేడిపొరల వల్ల విత్తనాలు మాడిపోతాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. వర్షం పడితే దుక్కులు చదునుచేసుకోవాలి. కనీస వర్షపాతం నమోదైతేనే రైతులు నాట్లు వేసుకోవాలి. కొందరు రైతులు ఇప్పటికే ముందస్తు నాట్లు వేసేందుకు నారుమడులు సిద్ధ చేస్తున్నారు. దీనివల్ల ఎండలకు నారుమడులు దెబ్బతింటాయి. ఆశించిన వర్షాలు పడినప్పుడే విత్తనాలు విత్తుకోవడం మంచిదని వ్యవసాయ విస్తీర్ణాధికారి రాకేశ్ సూచిస్తున్నారు. రబీలో ఆశించిన దిగుబడి రాలేదని ఖరీఫ్ కలిసొస్తుందని రైతులు ఆశిస్తున్నారు.

సకాలంలో అందించాలి

రోహిణి కార్తె నుంచే వ్యవసాయ పనులు మొదలు పెడుతాం. జీలుగ, జనుము, పిల్లిపెసరు విత్తనాలు ఇంతవరకు సెంటర్లకు రాలేదు. సరైన సమయంలో చల్లుకుంటేనే నాటు వేసే వరకు ఎదుగుతుంది. మా ఊరిలో ఎక్కువగా వరి సాగు చేస్తారు. సన్నాలకు ప్రభుత్వం బోనస్ ప్రకటించడంతో వరిసాగుకు సిద్ధమవుతున్నాం. ప్రభుత్వం జీలుగ విత్తనాలను సకాలంలో అందించాలి.

– చదువు జితేందర్‌రెడ్డి, రైతు, బొంతుపల్లి

ఎంపీ ఈటల వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి


మాట్లాడుతున్న అంబాల రాజు, నాయకులు

జమ్మికుంట: సీఎం రేవంత్‌రెడ్డిపై బీజేపీ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను బేషరత్‌గా వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అంబాల రాజు డిమాండ్ చేశారు. మండలంలోని మడిపల్లి గ్రామంలో శనివారం మాట్లాడారు. హైదరాబాద్‌లో నాలాలపై అక్రమ నిర్మాణం చేసుకోవడం వల్ల వర్షాకాలంలో నాలాల్లో పడి ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో హైడ్రాతో నిర్మాణాలు తొలిగిస్తే, అభివృద్ధిని కోరుకోని బీజేపీ నాయకులు అనవసర ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వమని, పేదల కోసం పనిచేస్తుందని, సీఎం రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేయడం తగదన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎగ్గెటి సదానందం, గ్రామశాఖ అధ్యక్షుడు ఉప్పల సాంబశివరెడ్డి, సీనియర్ నాయకులు మ్యాకమల్ల అశోక్, కాయిత లింగారెడ్డి, బండి కుమారస్వామి, పల్లకొండ సదానందం, సూర్యతేజారెడ్డి, ల్యాదల్ల వెంకటేష్ పలువురు పాల్గొన్నారు.


చొప్పదండి: నగర సంకీర్తనలో దీక్షాపరులు


జమ్మికుంట: శోభాయాత్రలో మహిళల కోలాటం


గన్నేరువరంలో..

హోరెత్తిన రామనామస్మరణ

చొప్పదండి: పట్టణంలోని హనుమాన్ దీక్షాపరులు శనివారం నగర సంకీర్తన చేపట్టారు. పుర వీధుల గుండా హనుమాన్ ఉత్సవ విగ్రహంతో ఊరేగింపు నిర్వహించి రామనామ స్మరణతో హోరెత్తించారు. చేయూత వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దీక్షాపరులకు మజ్జిగ పంపిణీ చేశారు. మండలంలోని మంగళపల్లి గ్రామంలో హనుమాన్ దీక్షాపరులు, గ్రామస్తులు శోభాయాత్ర నిర్వహించారు. హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి వీధుల గు ండా రామ నామం జపిస్తూ మహిళలు కోలాటం ఆడారు.

శంకరపట్నం: మండలంలోని లింగాపూర్ గ్రామంలో శనివారం ఆంజనేయస్వామి మాల ధారణ భక్తులు హన్‌మాన్ శోభాయాత్ర నిర్వహించారు. గ్రామంలో వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించగా మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు.

గన్నేరువరం: మండలకేంద్రం గన్నేరువరంలో శనివారం రాత్రి హనుమాన్ మాల భక్తులు శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ భక్తి పాటలతో గ్రామ వీధుల్లో వైభవంగా శోభాయాత్ర చేపట్టారు.

జమ్మికుంట: పట్టణంలో హిందూ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో హన్‌మాన్ జయంతిని పురస్కరించుకొని శనివారం రాత్రి అంబేద్కర్ చౌరస్తా నుంచి గాంధీ చౌక్ మీదుగా హన్‌మాన్ శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. హన్‌మాన్ ఉత్సవ విగ్రహాన్ని రథంపై పురవీధుల గుండా ఊరేగిచారు. ఒగ్గు కళాకారులు, మహిళల కోలాటం, చిన్నారులు నృత్యాలతో ఆకట్టుకున్నారు. ఈకార్యక్రమంలో ఉత్సవ కమిటి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సంతోషిమాత జ్ఞాపికలు అందజేత

పట్టణంలోని శ్రీసంతోషిమాత ఆలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న కుంబాభిషేకం మహోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి చందా రాజు, ఆర్గనైజర్ సెక్రెటరీలు యాద సతీష్, అయిత మహేశ్ ఆధ్వర్యంలో సంతోషిమాత జ్ఞాపికలను ప్రముఖ వ్యాపారులు ముక్క శివన్న, నారాయణతో పాటు దాతలు, వ్యాపారులు, భక్తులకు శనివారం అందజేశారు. కుంబాభిషేకం మహోత్సవానికి సహకరించిన దాతలు, భక్తులకు ప్రత్యేక కృజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో ఆలయ అభివృద్ధికి పట్టణ వ్యాపారులు, ప్రముఖులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అకినపల్లి మురళి, ఫర్టిలైజర్ అసోసియేషన్ నాయకులు రవి, భాస్కర్ పలువురు పాల్గొన్నారు.


శంకరపట్నం: లింగాపూర్‌లో..

హిందూ ఏక్తాయాత్రతో ఐక్యత చాటాలి


చిగురుమామిడిలో హిందూ ఏక్తాయాత్ర పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

హుజూరాబాద్: హిందూ ఏక్తాయాత్రను విజయవంతం చేయాలని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్రాల నిర్మలారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని బీజేపీ నాయకలతో సమావేశం నిర్వహించారు. 22న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ నేతృత్వంలో కరీంనగర్‌లో నిర్వహించే ఏక్తాయాత్రకు తరలిరావాలన్నారు. దేశభక్తిని చాటే గొప్ప కార్యక్రమం అని పేర్కొన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు రాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్, జిల్లా కౌన్సిలింగ్ సభ్యులు రావుల వేణు, నాయకులు రాజు, సబ్బని రమేష్, సారయ్య, శశిధర్, వెంకటేష్, భాస్కర్ పాల్గొనానరు.

రామడుగు: ఏక్తాయాత్రను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా కోశాధికారి వైద రామానుజం కోరారు. మండల కేంద్రం లో శనివారం పార్టీ మండల అధ్యక్షులు మోడీ రవీందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఏక్తాయాత్రతో ఐక్యతను చాటాలన్నారు. బీజేపీ మండల మాజీ అధ్యక్షులు ఒంటెల కరుణాకర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు బండ తిరుపతిరెడ్డి, ప్రధానకార్యదర్శి పోచంపల్లి నరేష్, పూరెల్ల శ్రీకాంత్‌గౌడ్, నాయకులు కట్ట రవీందర్, జిట్టవేని అంజిబాబు, బద్దం లక్ష్మారెడ్డి, కుమార్, ఎడవెల్లి రామ్ పలువురు పాల్గొన్నారు.


హుజూరాబాద్: మాట్లాడుతున్న నిర్మలారెడ్డి

చిగురుమామిడి: ఏక్తాయాత్రను విజయవంతం చేయాలని బీజేపీ మండలఖ అధ్యక్షుడు పోలోజు సంతోష్‌కుమార్ కోరారు. శనివారం చిగురుమామిడిలో ఏక్తాయాత్ర సన్నాహక సమావేశం నిర్వహించారు. ప్రతి పోలింగ్ బూత్ నుంచి 50 మందికి తగ్గకుండా తరలిరావాలని కార్యక్రమం పోస్టర్ ఆవిష్కరించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాంగోపాల్‌రెడ్డి, మండల ఇంచార్జి వెంకటేశం, మండల మాజీ అధ్యక్షుడు పైడిపెల్లి శ్రీనివాస్, జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాస్, నాయకులు నర్సయ్య, మహేందర్, శ్రీనివాస్‌రెడ్డి, శంకర్, మల్లేశం, సదాచారి పలువురు పాల్గొన్నారు.

భూ వివాదంపై ఆర్డీవో విచారణ

చిగురుమామిడి: తహసీల్దార్ కార్యాలయంలో శనివారం కరీంనగర్ ఆర్డీవోమహేశ్వర్ భూ వివాదంపై విచారణ చేవారు. మండలంలోని ముదిమాణిక్యంకు చెందిన బోయిని గణేశ్, దేవేంద్ర, కొమురయ్య పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వడంలేదని ఆరోపిస్తూ కలెక్టర్‌కు మూడు నెలల క్రితం ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో ఆర్డీవో గ్రామస్తులు, ఫిర్యాదుదారుల సమక్షంలో పూర్తిస్థాయి విచారణ నిర్వహించారు. బోయిని గణేశ్ తండ్రి కొంరయ్య కుటుంబానికి 2012 నాటికే 5.07 ఎకరాల వ్యవసాయభూమి ఉంది. అలాగే 2013లో 215వ సర్వేనంబర్‌లోని 28 గుంటల ప్రభుత్వ భూమి పట్టా జారీ అయింది. కాని రెవెన్యూ రికార్డుల్లో మాత్రం నమోదు కాలేదని ఆర్డీఓ చెప్పారు. డీ.ఆర్ అనగా డిస్ట్రిబ్యూషన్ రికార్డులో కూడ 28 గుంటలు పట్టా సర్టిఫికెట్‌కు నంబర్ అలాట్ కానందున అసైన్మెంట్ పట్టా సర్టిఫికెట్‌లో వాస్తవం లేదని తెలిపారు. చిగురుమామిడి తహసీల్దార్ ముద్దసాని రమేశ్‌కు ఎలాంటి సంబంధంలేదని, కావాలని ఫిర్యాదు దారుడు అబాసుపాలు చేశాడని ఆర్డీవో వివరించారు. తహసీల్దార్‌పై కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో వాస్తవంలేదని, నిరాధారమని పేర్కొన్నారు. విచారణ నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని వివరించారు. విచారణలో తహసీల్దార్ రమేశ్, ఆర్ఐ తార, ఫిర్యాదుదారులు గ్రామస్తులు పాల్గొన్నారు.


విచారణ చేస్తున్న ఆర్డీవో మహేశ్వర్

ఉపాధి కూలీలకు డబ్బులు చెల్లించాలి


సిబ్బందికి వినతిపత్రమిస్తున్న సీపీఐ నాయకులు


కూలీలతో మాట్లాడుతున్న సంపత్

గన్నేరువరం: మండలంలోని వివిధ గ్రామాల్లో ఉపాధిహామీ కూలీలకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీపీఐ మండల కార్యదర్శి చొక్కాల శ్రీశైలం కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆయా అధికారులు, సిబ్బందికి శనివారం నాయకులతో కలిసి వినతిపత్రం ఇచ్చారు. కూలీలు ఆరు వారాలుగా డబ్బులు అందక ఇబ్బందులు పడుతున్నారని, పనిచేసే చోట వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని అధికారులకు విన్నవించామన్నారు. ఉపాధిహామీ పథకంలో రైతులు పశువుల పాకలను నిర్మించుకొని చాలా రోజులు అవుతున్నా నేటి వరకు డబ్బులు చెల్లించలేదని వెంటనే చెల్లించాలని కోరామన్నారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి కూన మల్లయ్య, నాయకులు కాంతాల అంజిరెడ్డి, మొలుగూరి ఆంజనేయులు, గ్రామశాఖ సహాయ కార్యదర్శి బొమ్మకంటి ఆంజనేయులు, బూట్ల భాస్కర్, కూన కిష్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

శంకరపట్నం: వేసవిలో పనులు చేస్తున్న ఉపాధిహామీ కూలలకు వేతనాలు పెంచాలని వ్యవసాయకార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సుంకరి సంపత్ డిమాండ్ చేశారు. మండలంలోని ఏరడపల్లి గ్రామంలో కూలీలతో మాట్లాడారు. ఆరు వారాల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలపగా ఈ నెల 20న జరిగే ధర్నాలో ఉపాధిహామీ కూలీలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో దుర్గాప్రసాద్, కనకం భూపతి, నాగయ్య, చంద్రయ్య, రాజమ్మ, కోమల, రజిత, రేణుక, మల్లమ్మ, నర్సమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం


మానసను సన్మానిస్తున్న సేవా సమితి సభ్యులు

హుజూరాబాద్: పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన బత్తుల మానస జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైంది. శనివారం ఆమెను పీవీ సేవా సమితి సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు తూము వెంకట్‌రెడ్డి, మురికి గౌరి శంకర్, అనిత, కుటుంబ సభ్యులు ఉన్నారు.

హై బీపీని తేలిగ్గా తీసుకోవద్దు


బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

కరీంనగర్‌టౌన్: హైబీపీ ఒక వ్యాధి అని, దానిని తేలిగ్గా తీసుకుంటే ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉందని వైద్యులు పేర్కొన్నారు. వరల్డ్ హైపర్‌టెన్షన్ డే సందర్భంగా శనివారం కరీంనగర్ మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు, నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైద్యులు మాట్లాడుతూ, హైబీపీ కారణంగా శరీరంలోని గుండె, మెదడు, కిడ్నీ పనితీరుపై ప్రభావం పడుతుందన్నారు. హైబీపీ మధుమేహం కన్నా ప్రమాదకరమైనది, మానసిక ఒత్తిడి కారణంగా హైబీపీకి గురవుతున్నారని, ఒకసారి బీపీ బారిన పడితే తగ్గదని, కేవలం కంట్రోల్ పెట్టుకునేందుకు జీవితాంతం మందులు వాడాల్సిందేనన్నారు. ఇలాంటి వారు బీపీ కంట్రోల్‌లో ఉందని మందులు వాడకం నిలిపివేస్తే చాలా ప్రమాదమన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా రెగ్యులర్‌గా చెక్ బీపీ చేసుకోవాలన్నారు. హైబీపీ ఉన్న వారు ఆరోగ్యకరమైన జీవనశైలి, సరైన ఆహారం, వ్యాయామం, మందుల వాడకంపై దష్టి పెట్టాలని సూచించారు. ఆహారంలో ఉప్పు తగ్గించడం, ధూమ, మద్యపానాన్ని మానేయడం, బరువు ఎక్కువగా ఉంటే తగ్గడం చేయాలన్నారు. మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైద్యులు వినయ్, నాగరాజు, లోకేశ్, అనీష్ పబ్బ, రవిమల్లారెడ్డి, కోట కర్ణాకర్, సాయిచరణ్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రెండు కేటగిరీల పోటీలు


ట్రెడిషనల్ నెట్‌బాల్ బాలుర 8వ పోటీల్లో కరీంనగర్ బాలురు (రన్నర్)

- ఉత్కంఠ భరితంగా మిక్స్‌డ్ నెట్‌బాల్
- నేడు ముగింపు, బహుమతుల ప్రదానం

జనగామ: జనగామ జిల్లా కేంద్రంలోని బతుకమ్మ కుంటలో రాష్ట్రస్థాయి 8వ సబ్ జూనియర్ అండర్ –16 నెట్‌బాల్ చాంపియన్ షిప్ –2025 పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. రాష్ట్రంలోని 25 జిల్లాల నుంచి 620 మంది బాలబాలికలు హాజరయ్యారు. ట్రెడిషనల్, ఫాస్ట్ –5, మిక్స్‌డ్ నెట్‌బాల్ పోటీల్లో మూడు కేటగిరీల వారీగా క్రీడాకారులు తలపడుతున్నారు. ఇందులో ట్రెడిషనల్, ఫాస్ట్ –5 రెండు కేటగిరీలకు సంబంధించి బాలుర, బాలికల లీగ్, క్వార్టర్, సెమీ, ఫైనల్ మ్యాచ్‌లు ముగిశాయి. మిక్స్‌డ్ డబుల్ నెట్‌బాల్ పోటీలు శనివారం సాయంత్రం ప్రారంభమయ్యాయి.

రెండు కేటగిరీల్లో నారాయణపేట, మేడ్చల్ హవా

ట్రెడిషనల్, ఫాస్ట్ –5 నెట్‌బాల్ పోటీల్లో బాలుర, బాలికల విభాగంలో నారాయణపేట, మేడ్చల్ జిల్లాల హవా కొనసాగింది. ట్రెడిషనల్ నెట్‌బాల్ బాలుర 8వ పోటీల్లో నారాయణపేట (విన్నర్), కరీంనగర్ (రన్నర్), హైదరాబాద్, ఖమ్మం (థర్డ్ /సంయుక్తంగా), బాలికల విభాగంలో మేడ్చల్ (విన్నర్), నల్లగొండ (రన్నర్), జనగామ, ఖమ్మం (థర్డ్/సంయుక్తంగా) విజయకేతనం ఎగురవేశాయి. ఫాస్ట్ –5 నెట్‌బాల్ బాలుర 4వ పోటీల్లో నారాయణపేట (విన్నర్), ఖమ్మం (రన్నర్), మహబూబ్‌నగర్, కొమురం భీం ఆసిఫాబాద్ (థర్డ్ /సంయుక్తంగా), బాలికల విభాగంలో మేడ్చల్ (విన్నర్), ఖమ్మం (రన్నర్), జనగామ, కొమురం భీం ఆసిఫాబాద్ (థర్డ్/సంయుక్తంగా) బరిలో దిగి గెలుపొందాయి. మిక్స్‌డ్ డబుల్ పోటీలు ఆదివారం సాయంత్రం ముగియనున్నాయి. ముగింపు వేడుకల్లో విజేతలకు నిర్వాహకులు బహుమతులు, వ్యక్తిగతంగా ప్రశంస పత్రాలు ప్రదానం చేయనున్నారు.